క్లుప్తంగా

ఉచిత వైద్య పరీక్షలు



బిచ్కుంద: మండల కేంద్రంలో ఆదివారం ప్రాధానోపాధ్యాయుడు సీతయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్ ప్రారంభించారు. బాన్సువాడకు చెందిన సెవన్ హిల్స్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజాంసాగర్: మండలంలోని గోర్గల్ గ్రామంలో ఆదివారం ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మండల కేంద్రానికి చెందిన విజయలక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, లింగాగౌడ్, సందీప్, శ్రీకాంత్ రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల విరాళం

పిట్లం: మండలంలోని కారేగాం తాండలో నిర్మిస్తున్న జగదాంబమాత సేవాలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధికి మాజీ సర్పంచ్ తుకారం రూ.51 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

వేంకటేశ్వరాలయం అభివృద్ధికి..

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరాలయం అభివృద్ధికి సిద్ధ రామేశ్వర రైస్‌మిల్ యాజమాన్యం రూ.15 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరమ్ మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు, ప్రతినిధులు వీరమల్లి శ్రీనివాస్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మద్నూర్: రహదారుల్లోని మూల మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో పలువురు వాహనదారులు ప్రమాదాల బారి నపడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. మండలంలోని సోనాల, మదన్‌హిప్పర్గా, రుసే గావ్, దన్నూర్ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఎక్కువగా మూలమలుపులు ఉన్నాయి.

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్: మండలంలోని దూప్‌సింగ్‌తాండ, వెల్గనూర్ గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో కూలీలకు చెల్లించిన డబ్బులు, చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చెందర్‌రాథోడ్, రమేష్‌గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు బాల్‌సింగ్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

అన్నదాన కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: అవతార్ మెహెర్‌బాబా సెంటర్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుభాష్‌రోడ్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల రెండవ ఆదివారం నారాయణ సేవ పేరిట అన్నదానం చేస్తున్నట్లు మెహెర్‌బాబా సెంటర్ ప్రతినిధులు తెలిపారు.

కుక్కలతో భయం భయం

మద్నూర్: మండలంలోని సుల్తాన్‌పేట్, మద్నూర్, కొడిచిర, మద్నూర్ తదితర గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువయ్యాయి. గతంలో కుక్కల దాడిలో పలువురు స్థానికులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చేరిన విషయం తెలిసిందే. ఒంటరిగా వెళ్లాలంటేనే భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలను బయటకు పంపేందుకు జంకు తున్నారు. గ్రామాల్లో కుక్కలతో పాటు కోతులు, కొండముచ్చులు గ్రామాల్లో పెద్ద ఎత్తున తిరుగు తుండటంతో ఎప్పుడు దాడి చేస్తాయోననే భయందోళనతో వణికిపోతున్నారు.

పుస్తె, మట్టెల బహూకరణ

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి అల్లాడి నవనీతకు కొమ్మిరెడ్డి నారాయణ బంగారు పుస్తెలు, వెండి మట్టెలను ఆదివారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు బల్యాల వెంకట నర్సింలు, బల్యాల సుదర్శన్, సిద్దరాములు, కల్లూరి సిద్ధరాములు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు దూరంగా ప్రాంగణాలు

- వసతులు కల్పించని అధికారులు
- నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



నిజాంసాగర్: రాజుల పైసలు రాళ్ల పాలు అన్న చందంగా తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహిస్తూ వారిలో దాగి ఉన్న నేపుణ్యతను వెలికితీసేందుకు వీలుగా అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అధికారులు చాలాచోట్ల క్రీడా ప్రాంగణాల కోసం స్థలాలు ఎంపిక చేసి బోర్డులు ఏర్పాటు చేసి అందులో ఎలాంటి వసతులు కల్పించకుండా చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వం వాటి కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతి గ్రామ పంచాయతీల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాల కోసం రూ. 3.30 లక్షలు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ఒక్కొక్క గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణం వద్ద తోరణం, కబడ్డీ, సింగిల్ ఎక్సర్‌సైజ్, డబుల్ ఎక్సర్‌సైజ్, లాంగ్‌జంప్ పిట్ ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. చాలా చోట్ల గ్రామానికి సుదూర ప్రాంతంలో ఉన్న గట్లు, బండ రాళ్లు ఉన్న స్థలాలను క్రీడా ప్రాంగణాల కోసం స్థలాలను ఎంపిక చేశారు. దాదాపు అన్నిచోట్లా క్రీడా ప్రాంగణాల తోరణాల బోర్డులను ఏర్పాటు చేశారే తప్ప క్రీడలకు అవసరమైన పరికరాలు మాత్రం అక్కడ కన్పించవు. దీంతో ఆయా ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. కొన్నిచోట్ల ఆదివారం క్రీడా పోటీలు ప్రారంభించారు. మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డి, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతీ, యువకులు సీఎం కప్ క్రీడల్లో పాల్గొనేలా జట్లులను ఎంపిక చేశారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చాలా చోట్ల వినియోగించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉన్న మైదానాలను వినియోగించే పరిస్థితి నెలకొంది.

క్రీడలు ప్రారంభం

మాచారెడ్డి: మండల కేంద్రంలో ఆదివారం సీఎం కప్ క్రీడా పోటీలను వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, ఎంపీడీవో బాలక్రిష్ణ, ఎస్సై సంతోష్‌కుమార్ ప్రారంభించారు. వాలీబాల్ మహిళల విభాగంలో ఫరీదుపేట విన్నర్‌గా, మాచారెడ్డి టీం రన్నర్‌గా నిలిచాయి. పురుషుల విభాగంలో ఇసాయిపేట విన్నర్‌గా, మాచారెడ్డి రన్నర్‌గా నిలిచాయి. క్రీడల్లో విజయం సాధించిన జట్లకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఎంపీటీసీ వినోద తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: 15వ తేదీ నుంచి 17 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ ముదాం నర్సిములు మండలంలోని క్రీడాకారులను కోరారు.



మాచారెడ్డిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీడీవో, ఎస్సై

దోమకొండ: క్రీడలు నిర్వహించనున్న మైదానాన్ని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, పీఈటీ నర్సింహరెడ్డి ఆదివారం పరిశీలించారు.

'వంట' చేయాలంటే తంటాలే!

- అనేక చోట్ల గదులు లేక ఇబ్బందులు
- కొన్నిచోట్ల ఉన్నా ఇరుకుగానే..
- సెలవుల్లో వంట గదులు నిర్మించాలని పలువురి విజ్ఞప్తి



ధర్మారావ్‌పేట హైస్కూల్‌లో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)



ధర్మారావ్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో ఇరుకు గదిలో వంట చేస్తున్న నిర్వాహకురాలు (ఫైల్)

సదాశివనగర్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు చాలా చోట్ల వంట గదులు లేవు. అక్కడక్కడ వంట గదులు ఉన్నా ఇరుకుగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా గదులు లేనిచోట ఏజె న్సీ నిర్వాహకులు ఆరుబయటే వండుతున్నారు. దీంతో ఒక్కోసారి గాలులు వీచినప్పుడు భోజనంలో చెత్తా చెదారం పడి కలుషితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం వేసవి సెలవు లు ఉన్నందున వంట తయారు చేసేందుకు ప్రత్యేకంగా వంట శాలలు ఏర్పాటు చేయాలని విద్యా ర్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలంలోని ధార్మారావ్‌పేట ప్రాథమిక పాఠశాలలో వంట గది వున్నప్పటికీ చాలా ఇరుకుగా ఉండటంతో అతికష్టం మీద వంట తయారు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు గ్యాస్ సిలిండర్లతో వంట చేయాల్సి ఉన్నా అక్కడ కట్టెల పొయ్యి ఉపయోగిస్తున్నారు. దీంతో

వంట తయారు చేసే సమయంలో వచ్చే పొగ బయటకు వెళ్లే అవకాశం లేక ఏజెన్సీ నిర్వాహకులు శ్వాసకోస సంబంధిత వ్యాధులకు గురౌతున్నారు. సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అదేవిధంగా ధర్మారావ్‌పేట ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా వంట గదులు లేనందున ఆరుబయటే మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వంట గదులు లేవు. దీంతో పాఠశాల ఆవరణలోనే వంట వండుతున్నారు.

కట్టెల పొయ్యిలే దిక్కు..

చాలా గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వాహకులు మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కట్టెల పొయ్యిలు వాడుతున్నారు. గతంలో ప్రభుత్వం కొంతకాలం పాటు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసి తర్వాత సరఫరా నిలిపివేశా రు. గ్యాస్ ధరలు పెరగడంతో నిర్వాహకులు చేసేది ఏమీలేక కట్టెలపొయ్యినే వాడాల్సిన పరిస్థితి నెలకొంది.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పిట్లం: మండలంలోని ధర్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సహకార సంఘం చైర్మన్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ బాలాజీరావు, కార్యదర్శి హన్మండ్లు, బీఆర్ఎస్ నాయకుడు శివాజీ రావ్ పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని శేరిశంకర్ తండా, గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ కంది శివ రాములు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, సర్పంచులు శంకర్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.



అల్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నారాయణరెడ్డి

లింగంపేట: మండలంలో ఇప్పటి వరకు 1,064 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు చైర్మన్ దేవెందర్‌రెడ్డి తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కొనుగోళ్లు వేగవంతం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎప్పుడు ప్రారంభిస్తారు?



నిరుపయోగంగా ఉన్న ఏఎంసీ కార్యాలయం

సదాశివనగర్: మండల కేంద్రమైన సదాశివనగర్ శివారులోని 44వ జాతీయ రహదారి సమీపంలో 2018లో రూ. 60 లక్షలతో నిర్మించిన ఏఎంసీ భవనం నిర్మించినా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. భవనాన్ని ఉపయోగించక పోవడంతో గోడలు బీటలు వారుతున్నాయి. అంతేకాకుండా ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

ఆదమరిస్తే అంతే!

బాన్సువాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేళాడుతుండగా మరికొన్నిచోట్ల తక్కువ ఎత్తులో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దీంతో ముఖ్యంగా మూగజీవాలు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. సాగునీటి సౌలభ్యం అంతగా లేని పలు గ్రామాల్లో రైతులు బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారు. వీరంతా తమ పంట పొలాలకు వెళ్లే దారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లను తక్కువ ఎత్తులో బిగించడంతో వాటిని తాకుతూ వెళ్లే మూగజీవాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలని, రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ వైర్లకు పిచ్చిమొక్కలు, తీగలు వంటివి చుట్టుకుని ప్రమాదకరంగా మారాయి. పంట పొలాల్లోని విద్యుత్ వైర్లకు సైతం చెట్లు అల్లుకుని తరచూ తీగలు తెగిపోతుండటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది.



కొయ్యగుట్టలో తక్కువ ఎత్తులో కంచె లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ సింగిల్‌విండోను బస్వాపూర్‌లో విలీనాన్ని రద్దు చేసి తిరిగి కాచాపూర్‌లోనే నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చిత్రపటాలకు స్థానికులు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు ఎంపీపీ గాలిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ లింగాల కిష్టగౌడ్, సర్పంచ్ తొగరి సులోచన సుదర్శన్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బోరు బావి తవ్వకం పనులు



బోరు బావి తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

రాజంపేట: మండలంలోని గుడితండా, ఎల్లారెడ్డిపల్లి తండా, కొండాపూర్, ఇనాతండాలలో బోరు బావి తవ్వకం పనులను ఎంపీపీ లింగాల స్వరూప ప్రారంభించారు. గ్రామాలలో నీటి ఎద్దడి తీర్చేందుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండ హన్మండ్లు, సర్పంచ్‌లు స్వాతి, జీవ్లా నాయక్, దేవిదాస్, మాజీ ఎంపీపీ నీరడిశంకర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో మహాయజ్ఞం



పిట్లం: మండలంలోని గౌరారం తండాలో ఏర్పాటు చేసిన నూతన ఆలయంలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా నాలుగు రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన మహా యజ్ఞంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు.

■ హనుమాన్ ఆలయంలో చండీయాగం



పిట్లం: మండలంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి



కామారెడ్డి అర్బన్: హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని శ్రీపంచముఖి హన్‌మాన్ ఆలయం, శారదామాత ఆలయం, భూకస్‌పల్లి శ్రీఅభయాంజనేయ ఆలయం, దేవునిపల్లి, వివేకానంద కాలనీ, ఆర్‌బీ నగర్ ఇష్టసిద్ధి హన్‌మాన్, కోడూరి హన్మాండ్లుతో పాటు ఆదివారం స్థిర ప్రతిష్ఠాపన నిర్వహించిన దేవీవిహార్ శ్రీవీరాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ ఘనంగా హనుమాన్ జయంతి



తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో హనుమాన్ జయంతి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హనుమాన్ చిత్రపటాన్ని వాహనం ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

సదాశివనగర్: మండలంలోని ధర్మారావ్‌పేట్ గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఏనుగు బాల్‌రాజ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గైని రమేశ్, సంతోష్, కార్యదర్శిగా సుంకరి అంజయ్య, క్యాషియర్‌గా కొత్తపల్లి నవీన్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా వడ్ల గంగరాజు, కుమ్మరి రాజన్న, గాండ్ల రవి, మామిడి భూపతి, షబ్బీర్‌తో పాటు మరికొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.



ఎన్నికైన గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులు

ఘనంగా బోనాల పండుగ



కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దుర్గమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు



దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

బీబీపేట: మండలంలోని ఇస్సానగర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న దుర్గమ్మ ఉత్సవాలకు ఆదివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సంప్రదాయాలను పాటిస్తూ పండగలను జరుపుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.

లోపించిన పారిశుధ్యం..



బిచ్కుందలో రోడ్డుపైనే ఉన్న చెత్త



దామరంచలో మురుగుతో నిండిన డ్రెయినేజీ

బిచ్కుంద: గ్రామీణ ప్రాంతాల్ల పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. బిచ్కుందలో బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న చెత్తను తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. అదేవిధంగా టీచర్స్ కాలని, బాన్సువాడ వెళ్లే రోడ్డులో మూల మలుపు వద్ద చెత్త పేరుకపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎటు చూసిన చెత్తకుప్పలు దర్శనమిస్తుండటంతో స్థానికులు పాలకవర్గంపై ధ్వజమెత్తుతున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమవుతున్నా స్పందించేవారు లేరు. డ్రెయినేజీల్లో ఉన్న చెత్తను తీయడం లేదు. సమ్మెలో ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరినందున వెంటనే పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఎంపీవో మహిబూబ్ తెలిపారు.

నస్రుల్లాబాద్: బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో వీధులన్నీ కంపు కొడుతున్నా పంచాయతీ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. చాలా గ్రామాల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయక పోవడంతో ఎక్కడ చూసినా పందులు గుంపులు గుంపులుగా గ్రామాల్లో తిరుగుతున్నాయి. పారిశుధ్య పనులు చేపట్టాలని పలుమార్లు పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



కంకర వేసి వదిలేసిన సంగోజివాడి-కాలోజివాడి రోడ్డు

తాడ్వాయి: మండలంలోని సంగోజివాడి నుంచి కాలోజివాడి వెళ్లే రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. ఆ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు. రోడ్డు పూర్తయితే చందాపూర్, సంగోజివాడి, కాలోజివాడి, సదాశివనగర్ మండలంలోని ధర్మారావు, అమర్ల బండ, సదాశివనగర్‌కు చెందిన ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కల్గుతుంది.